# ఆధారం

పొద్దుటే వచ్చి సోఫాలో సీరియస్‌గా కూర్చున్న శరత్‌ని చూసి చాలా ఆశ్చర్యపోయాను.

"అలా వున్నావేంరా. ఇంట్లో అంతా బాగున్నారా?"

"నేను తప్ప అంతా బాగానే వున్నారు"

వింతగా చూశాను.

"అసలేం జరిగింది?"

"నేనా ఇంట్లోవుండలేను. నాకేదైనా ఉద్యోగం చూసి పెట్టండి అంకుల్"

"ఇంటర్ ఫెయిల్ అయినవాడికి ఏం ఉద్యోగం వస్తుంది" అని నవ్వబోయి నిగ్రహించుకున్నాను.

"డాడీ కొప్పడ్డారా?"

"ఊహూఁ మా మమ్మీకి నేనంటే ఇష్టంలేదు"

నవ్వకుండా వుండలేకపోయాను. "ప్రపంచంలో చెడ్డనాన్నలు వుండొచ్చు గానీ చెడ్డఅమ్మలు వుండర్రా"

"మా మమ్మీ చెడ్డదే. నేనంటే పడదు. తమ్ముడ్నీ చెల్లెల్నీ బాగా చూస్తుంది. నన్ను తిడ్తుంది. డాడీకి నామీద చాడీలు చెప్పి తిట్టిస్తుంది"

"అలాగా. ఎలాటి చాడీలు చెబుతోందిట?" అని అడిగాను.

"నేను చదువుకోవడంలేదనీ, క్రికెట్టు పిచ్చిలో పడ్డాననీ, టీవీని అంటిపెట్టుకు నుంటున్నాననీ, భోజనం దగ్గర గొడవ చేస్తున్నాననీ ఇంకా...."

"అర్థమైందిలే. నువ్విప్పుడు ఇంట్లోనే వుండి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నావుకదూ?"

తలాడిస్తూ దానికీ దీనికీ సంబంధమేమిటన్నట్లు చూశాడు.

"చూడు శరత్. ఇదివరకు కాలేజీకెళ్ళే వాడివి గనుక ఇంట్లో వుండే టైమ్ తక్కువ. కానీ ఇప్పటి పరిస్థితి వేరు. ఇంటర్ ఫెయిల్ అయినందున పొద్దుట్నుంచి సాయంత్రందాకా

ఇంట్లోనే వుంటున్నావు. ఫెయిలయ్యానన్న ఫీలింగు నీకు వున్నట్టుగానే మా పెద్దబ్బాయి ఫెయిల్ అయ్యాడన్న బాధ మీ అమ్మా నాన్నలకీ వుంటుందికదా?"

"మా అమ్మకి వుండదు" ఠకీమని అన్నాడు.

"ఆ పాయింటుకీ వస్తాను. కాస్త ఆగు. అసలే పని పాటల్తో విసిగిపోతున్నవారికి నువ్వు సరిగ్గా చదువుకోకపోయినా ఏదైనా బాగోలేదని విమర్శించినా ఆ విసుగంతా నీమీద ప్రదర్శించడం సహజం. దాన్ని నువ్వు అయిష్టం అనుకోకూడదు. నీ భవిష్యత్తు గురించే వాళ్ళ ఆందోళనని గ్రహించి మరింత శ్రద్ధగా చదువుకోవాలి. నువ్వు పైకొస్తే మీ అమ్మకన్నా ఎక్కువగా సంతోషించేవాళ్ళెవరూ వుండరు"

"మా మమ్మీ సంతోషించదు. నేను పాడైతేనే తనకిష్టం"

"పిచ్చి పిచ్చిగా వాగకు. నీ వయసెంతనీ పెద్ద పెద్దవ్యాఖ్యానాలు చేస్తున్నావ్?" కాస్త కోపంగానే అన్నాను.

"మా మమ్మీ సంగతి మీకు తెలీదు. ఇతరులు సంతోషంగావుంటే చూడలేదు. ఏదో ఒక పని చెబుతూంటుంది. మా మమ్మీ లేకపోతేనే హాయిగా వుంటాం"

నిర్ఘాంతబోయాను. ఓ నిమిషం ఆలోచించి అన్నాను–"అయితే ఓ పనిచెయ్యి శరత్. రేపు మరేం పనులూ పెట్టుకోకుండా కాగితం కలం తీసుకుని హాల్లో కూర్చో. మీ మమ్మీని మీ ఇంట్లోవాళ్ళుగానీ బయటివాళ్ళుగానీ ఎన్నిసార్లు పిలిచిందీ ఎందుకు పిలిచిందీ నోట్ చెయ్యి. పొద్దుట్నుంచి రాత్రి వరకూ మీ మమ్మీని అబ్జర్వ్ చెయ్యడమే నీ పని. ఎల్లుండొచ్చి కన్పించు. మాట్లాడదాం"

నా వంక అదోలా చూసి తలూపి వెళ్ళిపోయాడు.

మళ్ళీ రాడనుకున్నాను. కానీ కొన్ని పేపర్లతో వచ్చాడు. సీరియస్‌గా ఉన్నాడు. "అందులోంచి మీ మమ్మీని ఎవరెన్నిసార్లు పిలిచిందీ లెక్కవెయ్" అన్నాను.

ఒక అరగంట కుస్తీ పట్టి చెప్పేడు.

"మా డాడీ ఇరవై ఎనిమిది సార్లు. నేను పందొమ్మిది సార్లు, చెల్లి ముప్పైనాలుగుసార్లు, తమ్ముడు నలభై ఒక్కసార్లు పనిమనిషి పన్నెండుసార్లు, పక్కిళ్ళవాళ్లు ఆరుసార్లు మమ్మీని పిలిచారు"

"మీ ఇంట్లో వాళ్లు మంచినీళ్లివ్వు, పేపరివ్వు, వేడినీళ్ళు పెట్టు, బెల్టు ఎక్కడుంది, బూటు తుడవలేదు, సైకిల్ తాళం ఎక్కడుంది వగైరా చిన్న చిన్న పనులక్కూడా మీ మమ్మీని పిలిచారు కదూ?"

తలాడించాడు.

"నువ్వు కూడా అలాటివడివావు కదూ? నిజం చెప్పు"

తలూపాడు.

"ఇల్లు శుభ్రం చెయ్యడం, టిఫిన్లూ భోజనాలూ వండటం, అందరికీ వేళకి వడ్డించడం, అన్నీ అందించి ఆఫీసుకీ స్కూళ్ళకీ పంపించడం, బట్టలుతకటం, ఇస్త్రీ చెయ్యటం - ఇలాటివన్నీ మమ్మీ చేస్తోంది. అయినా మీరంతా ప్రతి చిన్న పనికీ మమ్మీ మీద ఆధారపడుతున్నారు. ఒప్పుకుంటావా?"

మళ్ళీ తలాడించాడు.

"అయినప్పటికీ మమ్మీ పని ఒత్తిడివల్ల విసుక్కుంటే, నీ బాగు కోరి మీ డాడీకేమైనా చెబితే విపరీతార్థాలు తీసి ఆమెకి నువ్వంటే ఇష్టంలేదనుకునే స్థాయికి వెళ్తున్నావు. అది సమంజసంగా అన్పిస్తోందా చెప్పు? మీ మమ్మీ లేకపోతే హాయిగా వుంటామన్నావు మొన్న. ఇప్పుడు నీ చేతిలోని లిస్టు సాక్షిగా ఆ మాట చెప్పగలవేమో ప్రయత్నించు"

తలొంచుకున్నాడు శరత్.

"చూడు శరత్. అమ్మ తన రక్తాన్ని పాలగా మార్చి బిడ్డకి తాగిస్తుంది. తను కరిగిపోతున్నా లెక్కచెయ్యకబిడ్డల ఉన్నతభవితకోసం అనుక్షణం తపిస్తుంది. తహతహలాడుతుంది. వారికోసం తన బ్రతుకునే ధారబోస్తుంది.

అమ్మని అర్థంచేసుకోడానికి ప్రయత్నించు. ఆమెకి సాయపడటానికి యత్నించు. ఆమె ఆశలు పండించటానికి కృషిచెయ్యి. అందులోనే నీకు ధన్యత వుంది. ఇంకెప్పుడూ మమ్మీ గురించి చెడుగా మాట్లాడకు.

భగవంతుడికి ప్రతి ఇంట్లోనూ వుండటం సాధ్యపడక తన బదులుగా తల్లిని సృష్టించాడురా. గుర్తుంచుకో"

"సారీ అంకుల్" ఏడ్చేశాడు శరత్.

"గుడ్. నీ కన్నీళ్ళు నీ పాపాన్ని కడిగి పవిత్రుడ్ని చేశాయి. గెటప్ మై బోయ్. వెళ్ళి మమ్మీకి సారీ చెప్పు. మమ్మీ కంటి వెలుగై వర్ధిల్లు!"

**(స్వాతి వారపత్రిక 24.4.1998)**